క్లుప్తంగా

నేడు ఆధార్ క్యాంపు

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరులో శుక్రవారం ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. గ్రామంలోని సచివాలయంలో నిర్వహిస్తున్న క్యాంపులో ఆధార్ అప్ డేట్, పేరు, ఇంటిపేరు, చిరునామా, పుట్టిన తేదీ మార్పు, ఫొటో తదితర అంశాల సవరణ చేసుకోవచ్చన్నారు.

ముత్యాలమ్మకు రూ.9.37 లక్షల ఆదాయం



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయానికి రూ.9,37,818 ఆదాయం వచ్చినట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సీ ఇంద్రసేనమ్మ తెలిపారు. గురువారం ముత్యాలమ్మ ఆలయంలోని హుండీల్లో రెండు నెలలుగా భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు చేపట్టామన్నారు. ఈ మేరకు పై తెలిపిన ఆదాయం వచ్చిందని ఆమె చెప్పారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేస్తామన్నారు. అంతకు ముందు అమ్మవారికి ఆలయాధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌బాబు, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు డీ చంద్రశేఖరరెడ్డి, సీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

సైదాపురం: మండలంలోని చీకవోలులో వైద్య సిబ్బంది గురువారం ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రావణి పరిశీలించారు. వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రోగుల పాలిట వరమన్నారు. సర్వేలో ఇంటింటినీ సందర్శించి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. సర్వే తరువాత రోగులకు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు.

జెడ్పీటీసీ సభ్యుడికి పితృవియోగం

దొరవారిసత్రం: స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు టీ రమేష్ తండ్రి కృష్ణయ్య అనారోగ్యంతో మైలాంగం గ్రామంలో బుధవారం మృతి చెందాడు. గురువారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ డీ శ్రీమంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ డీ గోపాల్‌రెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆ గ్రామానికి చేరుకుని కృష్ణయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ సింగయ్య, ఏపీఓ విజయ్‌భాస్కర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, నాయకులు శేఖర్ రెడ్డి, రమణారెడ్డి, మధురెడ్డి, గోపిరెడ్డి, తిరుపాల్ తదితరులు ఉన్నారు.


పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునందన

రాపూరు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీఓ సునందన పేర్కొన్నారు. పౌష్టికాహారం మాసోత్సవాల్లో భాగంగా రాపూరు మండలం గిలకపాడులో గురువారం పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిపాలలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని, బిడ్డకు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊరేగింపు



వినాయకుడి గ్రామోత్సవం

రాపూరు: మండలంలోని పెనుబర్తిలో ఏర్పాటు చేసిన వినాయకుడికి గురువారం విశేష పూజలు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు లీలామోహన్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, ప్రథమ స్థానంలో నిలిచిన విజయ్‌కు రూ.3 వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న అనూషాకు రూ.2 వేలు, తృతీయస్థానంలో నిలిచిన లలితకు రూ. 2 వేలు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి రూ.500 వంతున అందజేశారు. రాపూరులోని కాపువీధిలో అన్నదానం చేశారు.

దోమకాటు.. పాడికి చేటు



పాకలో దోమ తెరల మధ్య ఉన్న పాడి గేదెలు

వాతావరణంలో మార్పులు.. పరిసరాలతో పాటు పాకల్లో అపరిశుభ్రత.. పేరుకుపోతున్న చెత్తాచెదారం వెరసి దోమలు వృద్ధి.. పశువులకు దోమకాటు.. ఫలితంగా పశువులు మేత మానేయడం.. నలతగా ఉండడం..బలహీనం కావడంతో పాల ఉత్పత్తి తగ్గుతోంది. ఈ పరిణామంతో పాడిరైతుకు నష్టం వాటిల్లుతోంది. అయితే చిన్నపాటి జాగ్రత్తలతో ఈ పరిణామం నుంచి గట్టెక్కవచ్చని పశువైద్యులు చెబుతున్నారు. దీనిపై కథనం.

- తగ్గుతున్న పాల దిగుబడి
- పాడి పరిశ్రమపై శ్రద్ధ అవసరం
- దోమ తెరల వాడకం తప్పనిసరి



ఆరు బయట ఉన్న పశువులు

చిల్లకూరు: దోమ కాటుతో పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతోంది. ఫలితంగా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. రాష్ట్రంలో నేడు పాడి పరిశ్రమకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. పాడి రైతులకు వెన్ను దున్నుగా నిలుస్తూ పాల ధరలను పెంచి, వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అయినప్పటికీ వాతావరణంలో మార్పులు కారణంగా అప్పుడప్పుడు వర్షాలు కురుస్తుండడం, ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకు పోవడంతో దోమలు వృద్ధి చెందాయి. ఫలితంగా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని చోట్ల దోమల బెడద అధికమవుతోంది. ఓ వైపు ప్రభుత్వం దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడంతో దోమల బెడద తగ్గడం లేదు. దీంతో ఆరు బయట ఉండే పశువులపై అవి దాడి చేసి, కాటేస్తున్నాయి. పాడి పశువుల పొదుగుపై దోమలు కుట్టడడంతో పాల దిగుబడి తగ్గి పోతోంది. దీనికి పశు వైద్యులు తగిన సలహాలను ఇవ్వడంతో పాటుగా ప్రభుత్వం ద్వారా సహాయ, సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు.

పశువులకు దోమకాటుతో నష్టాలు

- దోమలు కుట్టడంతో పాల దిగుబడి తగ్గుతుంది.
- మేత సరిగా తీసుకోలేవు. దీంతో అవి బలహీనంగా తయారవుతాయి.
- జ్వరాల బారిన పడతాయి.
- శరీరంపై దద్దుర్లు, దురద, పుండ్లు ఏర్పడుతాయి.

మండలం	ఆవులు	గేదెలు
చిల్లకూరు	4,632	13,064
చిట్టమూరు	8,423	17,808
గూడూరు పట్టణ, రూరల్	1,690	17,040
కోట	2,480	10,982
వాకాడు	3,040	9,849

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- పశువుల పాకలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- సాధ్యమైనంత వరకు పశువుల కట్టే ప్రాంతం సిమెంట్ ఫ్లోరింగ్ ఉంటే బాగుంటుంది.
- ఎప్పటికప్పుడు పశువులు వేసిన పేడ, మూత్రం తొలగించే ఏర్పాటు చేయాలి.
- పశువులు కట్టే ప్రాంతానికి సమీపంలో గుంటల్లో నిల్వ నీరు, వ్యర్థాలు లేకుండా చూసుకోవాలి.
- ప్రధానంగా పశువుల షెడ్‌లు, పాకల్లో దోమలు చేరకుండా దోమ తెరలు వాడుకోవాలి.
- సాయంత్రం పూట పశువులు ఉండే పాక, షెడ్‌ల వద్ద వేపాకుతో పొగ వేయాలి.
- పశువుల తిని మిగిలిన మేతను నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

దోమతెరలతో పశువులకు రక్షణ



పశువుల పాకలో దోమతెరలు వినియోగిస్తే పశువులను వ్యాదుల భారి నుంచి రక్షించవచ్చు. దీనికితోడు పశువైద్యం అందుబాటులో ఉంది. పశువులను ఆస్పత్రికి తీసుకురాలేక పోతే సంచార పశు వైద్యశాల వారికి ఫోన్ చేస్తే ఇంటికే వచ్చి వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వం పాడి రైతులకు పాల ధరలు పెంచి ఎంతో మేలు చేసింది. అలాగే పాడి రైతులకు తోడ్పాటు నందిస్తుండడంతో పట్టణ ప్రాంతాలలో కూడా పాడి పశువులు పోషించగలుగుతున్నాం.

–దువ్వూరు భాస్కరరెడ్డి, పాడి రైతు, వీరారెడ్డిపల్లె

జాగ్రత్తలు పాటించాలి



పాడి పశువులున్న రైతులు వర్షా కాలం ఆరంభం నుంచి పాడి పశువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. దోమలతో పశువులు అనారోగ్యం పాలుకాకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు పశువుల ఆరోగ్యం పరిశీలిస్తూ మేత తినక పోయినా, ఉష్ణోగ్రతలో మార్పులు వచ్చినా, నలతగా ఉండి మేత సరిగా తీసుకోక పోయినా వెంటనే సమీపంలో ఉన్న పశు వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ సురేష్, ఏడీ, పశు సంవర్థక శాఖ, గూడూరు

జిల్లాస్థాయి పోటీలకు సైదాపురం విద్యార్థులు



విజేత విద్యార్థులతో పీడీ

సైదాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బీ శ్రీలేఖ అండర్–14, నమృత, అచ్యుత్ అండర్–17కు టెన్నికాయిట్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ కోటేశ్వరరావు తెలిపారు. అలాగే డక్కిలిలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి పోటీల్లో అండర్–17 విభాగం లాంగ్‌జంప్ పోటీల్లో ఐశ్వర్య ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు.

అందరికీ వైద్యపరీక్షలు చేయాలి

నాయుడుపేట: మండలంలోని ప్రజలందరికీ వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేయాలని ఎంపీడీఓ శివప్రసాద్ సూచించారు. మండలంలోని కూచివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేని గురువారం ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు సత్వరం అందించే దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యసురక్ష కార్యక్రమం అమలు చేశారని తెలిపారు. సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి, వారికి వైద్య సేవలు చేరువయ్యేలా చూడాలన్నారు.

ప్రతి సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు



సమావేశంలో ఎమ్మెల్యే సంజీవయ్యకు విద్యుత్ సమస్యలు వివరిస్తున్న సభ్యులు

దొరవారిసత్రం: సర్వసభ్య సమావేశంలో ఎదురైన ప్రతి సమస్యకు పరిష్కారం దిశగా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచించారు. గురువారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుజాతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో తొలుత మేలుపాక, దుప్పలవారికండ్రిగలో విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయని సర్పంచ్ మధురెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వాటి పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా వ్యవసాయ సీజన్ మొదలైందని, పచ్చిరొట్ట ఎరువులు అధిక మోతాదులో రైతులకు సరఫరా చేయాలని పలువురు ఎమ్మెల్యేని కోరారు. అనంతరం ఏఓ జ్యోతిర్మయి మాట్లాడుతూ డీవీ సత్రం మండలానికి డ్రోన్స్ ద్వారా పంటలకు మందులు పిచికారి చేసేందుకు మూడు యూనిట్లు లక్ష్యం ఇచ్చారని, ఆసక్తి కలిగిన వారు ముందుకు రావాలన్నారు. ప్రస్తుతం వర్షం కురుస్తున్నందున గొర్రెలకు ముసర వ్యాధి వ్యాపించే అవకాశం ఉందని, ఆ వ్యాధి నివారణకు మండలంలో వ్యాక్సిన్ సిద్ధంగా ఉందని పశువైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. ఈసమావేశంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ సింగయ్య, అధికారులు మనోజ్, కస్తూరయ్య, పద్మావతి, కోఆప్షన్ సభ్యులు మౌలా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

ఓజిలి: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం రాజుపాళెం వద్ద జాతీయ రహదారిపై సమితి నాయకులు రాస్తారోకో చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రవి మాట్లాడుతూ 29 ఏళ్లగా పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెడుతున్నట్లు కేంద్రంలోని అధికార పార్టీ నాయకులు మభ్య పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎం విజయలక్ష్మి, ఎం మల్లికార్జున, ఏ రామయ్య, ఎం వెంకటస్వామి, ఎం రవి, చెంచుకృష్ణయ్య పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

డక్కిలి: ఉపాధ్యాయుడిపై దాడి దారుణమని, ఈ ఘటనకు పాల్పడిన ఎంఈఓపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఈఎఫ్ తిరుపతి జిల్లా ప్రధానకార్యదర్శి డీ పెంచలయ్య డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం చిన్న దోర్నాల ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కే సుధాకర్‌పై ఎంఈఓ మస్తాన్ నాయక్ దాడి చేసి గొంతు నులమడం దారుణమైన సంఘటన అన్నారు. కొంత మంది ఎంఈఓలు చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారని, కనీసం మహిళా టీచర్లు ఎంఈఓలను సెలవు మంజూరు చేయాలని అడిగేందుకు కూడా భయాందోళనకు గురి కావాల్సి వస్తుందన్నారు. మహిళా ఉపాధ్యాయులు సెలవు కోసం ఎంఈఓలకు ఫోన్ చేస్తే ఏకవచనంతో ఇష్టానుసారంగా మాట్లాడేవారు చాలా మంది ఉన్నారన్నారు.

నిమ్మలో తెగుళ్లు అరికట్టాలి



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

డక్కిలి: నిమ్మతోటల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి, తెగుళ్లను అరికట్టాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కర్‌య్య సూచించారు. ఆత్మ సహకారంతో డక్కిలి మండలం తీర్థంపాడులో నిమ్మ సాగు చేసే రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుకుళ్లు, మంగు, ఎండు పుల్ల తెగుళ్లు నిమ్మకు ఎక్కువగా నష్టం కలిగిస్తున్నాయన్నారు. భూమిలో అధికంగా తేమ లేదా బెట్ట పరిస్థితులు ఉన్నప్పుడు గాలి ప్రసరణ సరిగా లేని బరువు నేలలో వేరుకుళ్ల ఎక్కువగా ఆశిస్తుందని తెలిపారు. దీని నివారణకు కిలో ట్రైకోడెర్మా జీవ శిలింద్ర మందు, 90 కిల్లో పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి మిశ్రమం కలిపి చెట్టు పాదికి 10 కిలోల వంతున వేసి కలిపితే వేరుకుళ్లను నివారించవచ్చని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణు గోపాలరావు, ఏఓ విజయభారతి, తీర్థంపాడు సర్పంచ్ పీ జగన్‌మోహన్‌రెడ్డి, సచివాలయ ఉద్యాన సహాయకురాలు లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల షెడ్యూల్ విడుదల



షెడ్యూల్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్ –19 క్రీడా షెడ్యూల్‌ను గురువారం నెల్లూరు కేఏసీ కళాశాలలో ఉన్న డీవీఈఓ కార్యాలయంలో డీవీఈఓ కె.మధుబాబు, ఆర్ఐఓ డాక్టర్ ఎ.శ్రీనివాసులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, స్విమ్మింగ్, ఫెన్సింగ్, బ్యాడ్మింటన్, త్రోబాల్ పోటీలు జరుగుతాయన్నారు. అదే స్టేడియంలో 26న ఖోఖో, హాకీ, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, టేబుల్ టెన్నిస్ నిర్వహిస్తారన్నారు. 27వ తేదీన డీకేడబ్ల్యూ కళాశాల, చిల్లకూరు గురుకులంలో చెస్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్ని కాయిట్ పోటీలు నిర్వహిస్తారన్నారు. 29న ఏసీ స్టేడియంలో సెపక్‌తక్రా, నెట్‌బాల్, టెన్నిస్, అక్టోబర్ 2న స్టేడియంలోనే క్రికెట్, తైక్వాండో, యోగా, ఫుట్‌బాల్, కబడ్డీ, ఆర్చరీ, రోప్ స్కిప్, సెపక్‌తక్రా, 3న స్టేడియంలో రగ్బీ, జూడో, జిమ్నాస్టిక్స్, సాఫ్ట్ టెన్నిస్, చిల్డ్రన్స్ పార్క్‌లో స్కేటింగ్ పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు పదో తరగతి మార్క్స్ మెమో లేదా జనన ధ్రువీకరణపత్రం తీసుకురావాలని తెలిపారు. ఫారం–3లో ప్రిన్సిపల్, పీడీ, సంతకాలతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, పీడీ డి.శ్రీరేష్‌ను 97048 27095 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గూడూరుకు గుర్తింపు తేవాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పానకా దేవసేనమ్మ

గూడూరురూరల్: రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభను చాటి గూడూరుకు గుర్తింపు తీసుకురావాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీ దేవసేనమ్మ అన్నారు. గూడూదూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగాల బాలబాలికలకు నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. దేవసేనమ్మ మాట్లాడుతూ మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో పోటీలకు ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. ఇక్కడ పాల్గొన్న క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో గూడూరు ప్రతిభను చాటాలన్నారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను చాటి గూడూరుకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారని, అందరూ బాగా ఆడాలన్నారు. ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడు తూ క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వం చేకూరుతుందన్నారు. డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి, ఎంఈఓ కాంచన, చిల్లకూరు ఎంఈఓ రవూఫ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, నాయకులు గోపాల్ యాదవ్, ముని, సాయి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఎంపెడా డీడీ శివరాజన్

చిల్లకూరు: ఆక్వా సాగు చేసే రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని ఎంపెడా డీడీ శివరాజన్ సూచించారు. మండలంలోని అంకులపాడూరులోని కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఆక్వా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతులు ముందుగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. అటు తరువాత సాగు చేసే గుంతలు ఎంత మేర విస్తీర్ణంలో ఉండాలి, నీటి సాంద్రత, ఉప్పు శాతం ఎంత మేర ఉండాలి అనే విషయాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. కొంత మంది గుంతలో మురుగు ఉన్నప్పటికీ చేప పిల్లలను వదలడంతో ఎదుగుదల ఉండదని చెప్పారు. అలాగే అనుమతులు లేని రసాయనాలను ఎక్కువగా వాడుతున్నారని, దీంతో నష్టాలు చవి చూడాల్సి వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రొయ్యల ధరలను పెంచుతున్న క్రమంలో రైతులు ఇబ్బంది పడనవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ రాజేష్, ఎఫ్‌డీఓ రఘుబాబు, ఎఫ్‌టీఓ స్వాదీప్, మత్స్యశాఖ సహాయకురాలు లిఖిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్

డక్కిలి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతోందని, విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. డక్కిలిలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం వెంకటగిరి నియోజకవర్గ స్థాయి అండర్–14, అండర్ –17 విభాగాల్లో భాగంగా గురువారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జగదీష్ బాబు వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ టీ ప్రసన్నకుమారి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ రవీంద్రారెడ్డి, సర్పంచ్ వేమక్క, హెచ్ఎం నాగరాజు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త గురజాడ



అవగాహన సదస్సులో పాల్గొన్న వక్తలు, ఉపాధ్యాయులు

చిల్లకూరు: నాడు దేశంలోని మూఢ నమ్మకాలను తొలగించి, సంస్కరణలకు తెరతీసిన సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని భారతీయ శిక్షణా మండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రజేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు దేశంలోని అట్టడుగు వర్గాలవారి అభ్యున్నతిని కోరుకునేలా దేశంలో వేళునూకున్న పలు మూఢ నమ్మకాలను తొలగించేలా కన్యాశుల్కం అనే నాటకం ద్వారా ఎంతో మందికి కనువిప్పు కలగించారన్నారు. అలాగే పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, కన్యక అనే రచనల ద్వారా సమాజంలోని దురాచారాలను రూపు మాపారన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్ర లేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బండ్ల సుధాకర్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై కౌన్సిలర్ల మండిపాటు



మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

వెంకటగిరిరూరల్: అధికారుల నిర్లక్ష్యంపై కౌన్సిలర్లు మండిపడ్డారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 4వ వార్డు కౌన్సిలర్ నారాయణ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం సక్రమంగా అందకుండా పక్కాదారి పడుతున్నాయన్నారు. 5వ వార్డు కౌన్సిలర్ శేఖర్ మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో 3 బోర్లు మంజూరైతే ఒక్క బోరు వేసుకున్నామని, దానికీ బిల్లులు మంజూరు చేయలేదని ఆరోపించారు. భ్రమరాంబ థియేటర్ వద్ద పిల్లారి గుడికి చెందిన స్థలం ఆక్రమించుకుని, ఇల్లు కడితే ఆ ఇంటికి పన్ను ఎలా వసూలు చేస్తారని, కమిషనర్, అధికారులకు ఎంత ముట్టిందని నిలదీశారు. ఆరో వార్డు కౌన్సిలర్ జానకిరామ్ మాట్లాడుతూ వార్డుల్లో వీధిలైట్లు ఏర్పాటుకు మున్సిపల్ అధికారులకు అడిగితే సరైన సమాధానం లేదన్నారు. వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య మాట్లాడుతూ తమ వార్డులో శానిటేషన్ మెరుగు పరచాలని కోరారు. 7వ వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ వార్డుల పరిధిలో 11 రకాల సమస్యలు పరిష్కరించాలన్నారు. 9వ వార్డు కౌన్సిలర్ కళ్యాణి మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్‌లు లీకేజీలు అవుతున్నాయన్నారు. 10 వార్డు కౌన్సిలర్ శివయ్య, 12వ వార్డు కౌన్సిలర్ గోపాల కృష్ణ మాట్లాడుతూ తమ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అడుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారన్నారు. 11వ వార్డు కౌన్సిలర్ సుకన్య మాట్లాడుతూ తమ వార్డులో మోటర్ల మరమ్మతు బిల్లు రూ. 8 వేలు మంజూరులో అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య మాట్లాడుతూ తమ వార్డులో భూ ఆక్రమణలు అధికంగా జరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 16 వార్డు కౌన్సిలర్ రాధ మాట్లాడుతూ తమ వార్డులో స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. 17, 18, 19, 22వ వార్డు కౌన్సిలర్లు పీ లక్ష్మి, విజయలక్ష్మి, వహిదా, ఉమామహేశ్వరి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. 21వ వార్డు కౌన్సిలర్ జి ఢిల్లీబాబు మాట్లాడుతూ ప్రధాన ప్రాంతాల్లో ఫాగింగ్ పనులు చేపట్టాలని కోరారు. 24వ వార్డు కౌన్సిలర్ ఆటం బాకం శ్రీనివాసులు మాట్లాడతూ రూ. 44 లక్షలతో స్త్రీశక్తి భవనం నిర్మించారని, అది అసాంఘిక కార్య కలాపాలకు నిలయంగా మారుతుందని ఆరోపించారు.

తూపిలిపాళెం బీచ్‌లో వేడుకగా నిమజ్జనం



గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

వాకాడు: మండలంలోని తూపిలిపాళెం బీచ్‌లో మూడు రోజులుగా గణేష్ నిమజ్జనం కొనసాగుతోంది. గురువారం వివిధ ప్రాంతాల నుంచి వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు 155 విగ్రహాలను సముద్రంలో నిమజ్జనం చేశారు. దాదాపు 25 వేల మంది భక్తులు సముద్ర తీరంలో నిమజ్జన పూజలు చేసి, స్నానాలు ఆచరించారు. దీంతో తూపిలిపాళెం బీచ్ భక్తులతో కిట కిటలాడింది.

టేకుచేప ముల్లు తగిలి 12 మందికి గాయాలు

వాకాడు: మండలంలోని తూపిలిపాళెం బీజ్‌లో జరుగుతున్న వినాయక నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. గణేష్ నిమజ్జనాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు బీచ్‌లో భక్తి స్నానాలు ఆచరిస్తున్న నేపథ్యంలో టేకుచేప ముల్లు తగిలి 12 మంది భక్తులు గాయపడ్డారు. వీరిని కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



తూపిలిపాళెంలో సముద్రస్నానం ఆచరిస్తున్న భక్తులు